



• శిథిలావస్థలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

వినియోగంలోకి రాని మున్సిపల్ కాంప్లెక్స్...



వృథాగా.. వదిలేశారు

- ములకలూరులో ముస్లిం విద్యార్థుల వసతి గృహాలు, ఐటీఐ కళాశాల
- నరసరావుపేటలో మునిసిపల్ మార్కెట్ పరిస్థితీ అంతే..
- కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు, స్టేడియంలో ఈత కొలను..
- ఐదేళ్లుగా వీటి వినియోగం మరిచారు..
- కోట్ల రూపాయలు వృథా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కొత్త భవనాలు నిర్మాణం ఎలా ఉన్నా పాత భవనాలను పాడుబెట్టారు. తెలుగుదేశం పాలనలో నిర్మించిన భవనాలు, ఈత కొలను, పార్కులను ఐదేళ్లుగా వినియోగించకుండా వదిలేశారు. వీటికోసం వెచ్చించిన కోట్లాది రూపాయలు నిరుపయోగం అయ్యాయి. పాలకుల నిర్లక్ష్యం వలనే ఈ దుస్థితి నెలకొంది.

ముస్లిం మైనార్టీ విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నరసరావుపేట మండలం ములకలూరు వద్ద మైనార్టీ బాలుర, బాలికల వసతి గృహాలను నాటి టీడీపీ ప్రభుత్వం రూ.8.12 కోట్లు వెచ్చించి నిర్మించింది. ఒక్కో భవనం రూ.4.20 కోట్లతో 100 పడకల సామర్థ్యంలో నిర్మించారు. ఇక్కడ 100 మంది బాలురు, 100 మంది బాలికలకు వసతి కల్పించే అవకాశం ఉన్నా ఈ దిశగా ప్రభుత్వం స్పందించడంలేదు. వసతి గృహాలనూ వినియోగించకుండా పాడుబెట్టారు. వసతి గృహాలను నిర్వహించాలంటే రెండింటికి 10మంది ఉద్యోగుల ను నియమించాలి. ఆ దిశగా అడుగులు వేయలేదు. అదేవిధంగా ముస్లిం మైనార్టీ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించే లక్ష్యంతో ఐటీఐ కళాశాల, దీనికి అనుబంధంగా అన్ని వసతులతో వసతి గృహాన్ని నిర్మించారు. కేంద్ర ముస్లిం మైనార్టీ శాఖ నుంచి ప్రత్యేకంగా ఈ నిధులు విడుదల అయ్యాయి. ఐటీఐ కళాశాలలను ప్రారం భించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటున్న దాఖలాలు లేవు. కళాశాలలను ప్రారంభించేందుకు మిషనరీ, ఉద్యోగులు, అధ్యాప కులను నియమించాల్సి ఉంది. ఈ ప్రక్రియను ఇంకా ప్రభుత్వం ప్రారంభించక పోవడం ముస్లిం విద్యార్థు లపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

ఉద్యానవనం ఉసూరు..

జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం కల్పించేందుకు ఒక్క ఉద్యానవనం కూడా లేదు. చిన్నారులకు వినోదం కలిగించే రీతిలో పార్కుల అభివృద్ధి జరగలేదు. ఉన్న పార్కులను కూడా మునిసిపాల్టీ పాడుబెట్టింది. పల్నాడు రోడ్డులోని కాసు బ్రహ్మానందరెడ్డి మునిసిపాల్టీ ఉద్యానవనం మందు బాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యక్రమాలకు నెలవైంది. పార్కు నిర్వహణను పురపాలకులు గాలి కొదిలేశారు. అమృ త్ పథకంలో భాగంగా రూ.108 లక్షలతో పార్కును గత తెలుగుదేశం కౌన్సిల్ హయాంలో నిర్మించారు. దీనిని 2019 జనవరిలో ప్రారంభించారు. పార్కును మునిసిపాల్టీ మూసివేసింది. ఉద్యాన వనంలో ఓపెన్ వేదిక, స్కేటింగ్ ప్లాట్‌ఫాం, కూర్చునేందుకు వీలుగా షెల్టర్స్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుతో పాటు అందమైన మొక్కలను నాటారు. వీటి సంరక్షణను గాలికొదిలేశారు. కనీసం కాపలా దారుడిని కూడా నియమించలేదు. తాళాలు వేయకుండా వదిలే యడంతో రాత్రి పగలు అన్న తేడాలేకుండా మందుబాబులకు షెల్టర్‌గా మారిపోయింది. ఉద్యానవనం కోసం వెచ్చించిన నిధులు వృథాగా మారాయి.



• ఐదేళ్ల కిందట ప్రారంభించిన బాలికల వసతి గృహం



ఐటీఐ కళాశాల భవనం


ఆదాయ వనరులను వినియోగించుకోవడంలో పురపాలక సంఘం ఘోరంగా విఫలమైంది. రూ.7.40 కోట్ల వ్యయంతో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగించడం లేదు. ఇందుకు వెచ్చించిన నిధులు నిరుపయోగంగా మారాయి. కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. మాంసం, చేపల మార్కెట్‌ల కోసం షాపులను మునిసిపాల్టీ నిర్మించింది. వీటిని లీజుకు ఇవ్వకుండా వదిలేయడంతో వీటిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. మందు బాబులకు అడ్డాగా మారింది. రైతుల కోసం కాంప్లెక్స్‌లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో సచివాలయాలు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక మటన్, చేపల మార్కెట్‌లను మూసివేసి ఉంచారు. రోడ్ల వెంట ప్రతి ఆదివారం మాంసం, చేపల విక్రయాలు జరుగుతున్నాయి. వీటిని నిరోధించి ఈ షాపులు మార్కెట్ తరలించే ప్రయత్నాలు జరగడం లేదు. కాంప్లెక్స్ ఎదుట రోడ్డు వైపునకు 10 షాపులు నిర్మించారు. వీటిని కూడా లీజుకు ఇవ్వలేదు. కాంప్లెక్స్ ద్వారా ఏటా లక్షల్లో ఆదాయాన్ని మునుసిపాల్టీ కోల్పోతోంది.



ఐదేళ్ల కిందట ప్రారంభించిన బాలుర వసతి గృహం

క్రీడా ప్రాంగణం వదిలేశారు..

నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం రాష్ట్రంలోనే అతి పెద్దది. దాదాపు 20 ఎకరాల స్థలంలో క్రీడా ప్రాంగణం రూపుదిద్దుకుంది. 1997లో నరసరావుపేట ద్విశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్టేడియం నిర్మించారు. నవ్యాంధ్ర తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విశేష కృషి ఫలితంగా స్టేడియం నిర్మాణం జరిగింది. దీనిని ఆయన మానస పుత్రికలా భావించి అభివృద్ధి చేశారు. స్టేడియం నిర్వహణకు నిధుల విడుదలను ప్రభుత్వం విస్మరించింది. స్టేడియంలోని కొన్ని విభాగాలను ప్రైవేటీకరించింది. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈత కొలనును వినియోగించకుండా వదిలేశారు. ఈత కొలను కూడా లీజుకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా ఒక్కొక్కటిగా ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకొంటోంది. ఈ చర్యలు పేద క్రీడాకారులను క్రీడలకు దూరం చేసేవిగా ఉన్నాయని చెప్పవచ్చు.



• పాడుబెట్టిన ఈతను కొలను

రెవెన్యూ రూటే.. సపరేటు!



- దస్త్రం కదలాలంటే.. పైసలు చేతిలో పడాల్సిందే!
- కుప్పలు తెప్పలుగా ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు
- ఒక్కో దరఖాస్తుకు ఒక్కో ధర
- గురజాల నియోజకవర్గంలో రెవెన్యూ అధికారుల తీరిది

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 19: రెవెన్యూ కార్యాలయాలు అవినీతి నిలయాలుగా మారాయి. ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఏమాత్రం బెరుకు, భయం లేకుండా రెవెన్యూ అధికారులు ఒంటెత్తు పోకడ సాగిస్తునే వున్నారు. 2019 తరువాత రెవెన్యూ కార్యాలయాల్లో కొందరి మాటే చెల్లుబాటు అవుతోంది. మిగిలిన వారు ఎంత మొత్తుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అదేమిటని ప్రశ్నిస్తే చాలు.. చూద్దాం చేద్దాం అంటూ కొర్రీలు వేస్తున్నారు. దీంతో రైతులను, లబ్ధిదారులు కాళ్లకు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల రెవెన్యూ తహసీల్దార్ల కార్యాలయాల్లో కొందరు అధికారుల తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వచ్చే వారు రైతులైనా.. లబ్ధిదారులైనా మనవాళ్లయితే చాలు అన్నట్టుగా రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి ఆ ప్రకారం కొందరు మధ్యవర్తులు, పార్టీ నేతలు ద్వారా కొందరు రెవెన్యూ అధికారులు ఆ నేతలు చెప్పిన పనుల్లా చేసి రెండు చేతులా సంపాదిస్తున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కూడా రాని ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు ఒక్క పిడుగురాళ్లలోనే కుప్పలు తెప్పలుగా వచ్చాయి. పిడుగురాళ్ల మొదలు కొని పొందుగల వరకు రాష్ట్ర రహదారికి ఇరువైపుల ఇష్టానుసారంగా అనుమతులు వున్నవి కొన్ని.. లేకుండా మరికొన్ని వెంచర్లు పుట్టుకొచ్చాయి. ప్లాట్ల కొనుగోలు దారులను మభ్య పెట్టేందుకు ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేశామని, త్వరలో పూర్తి అవుతుందని చెప్పుకుంటూ ప్లాట్‌లను అనధికారికంగా విక్రయించారు. ఒక్క పిడుగురాళ్ల రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయానికే సుమారు 200కు పైగా ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు వచ్చాయి. వాటన్నింటిని అధికారులు దశల వారీగా సర్టిఫికెట్లను జారీచేశారు.

ల్యాండ్ కన్వర్షన్‌లోనూ..

ఇదేవిధంగా దాచేపల్లి, గురజాలలో కూడా పెద్దఎత్తున ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు రాగా, వీటన్నింటిని రెవెన్యూ అధికారులకు సుపరిచితుడైన ఓ వ్యక్తి చేతపట్టుకొని రావడం అధికారులతో ఇదిగో.. ఇంత అంటూ చెప్పి పని పూర్తిచేయించు కుంటున్నారు. ఆ విధంగా పల్నాడులో కొందరు రెవెన్యూ



పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం

అధికారులు కోట్లకు పడగలెత్తారు. ఒక్కో దరఖాస్తుకు ఒక్కో ధర నిర్ణయించి వసూలు చేశారు. పిడుగురాళ్ల చెరువు భూమిలోను ఇష్టానుసారంగా అనధికార కట్టడాలు, స్థలాలు ఆక్రమించుకోవడంతో పాటు రెవెన్యూ పాత రికార్డులను తిరగేసి మరీ కొందరు అధికారులు రికార్డులను మార్చివేసి అనుకూలమైన వారి పేర్లను చేర్చడం వెనుక పెద్ద కథే నడిచింది. దీనికోసం రెవెన్యూ కార్యాలయాలలో ఒకరిద్దరు అధికారులు రాత్రి 8, 9 గంటల వరకు కూడా కార్యాలయంలోనే వుండి పనులు చక్కబెట్టేశారు. పిడుగురాళ్ల బైపాస్ రహదారికి సమీపంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో కొంత భాగాన్ని రెవెన్యూ అధికారులు తమ బినామీల పేరుతో, మరికొంత ఎవరైతే ఎక్కువగా చేతిలో బరువు పెట్టగలరో వారి పేరున రికార్డులను సృష్టించారు. ఇందుకోసం లక్షల రూపాయలు డీల్ కుదుర్చుకొని మరీ వారి పేరిట రికార్డులను తారుమారు చేశారు. దాచేపల్లి మండలం పొందుగల, తంగెడ సమీపంలోనూ వందల ఎకరాల ప్రభుత్వ భూములను సైతం కొందరి పేరిటే రికార్డులు మార్చిన రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతలని కూడా వదలకుండా వారి వద్ద నుండి కప్పం కట్టించుకున్నారు. పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో అనధికార వ్యక్తులు కొందరు రికార్డుల పని చేయడం పలు విమర్శలకు తావిచ్చింది. ఇక్కడి కార్యాలయంలో అధికారికంగా వీఆర్‌ఓలు ఒక గ్రామంలో విధులు నిర్వహించాల్సి వుండగా అంతా తామై నడిపిస్తుండటంతో మిగిలిన గ్రామాల వీఆర్‌ఓలు అసంతృప్తికి, అసహనానికి లోనవుతున్నారు. తమ గ్రామాల పరిధిలో రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు తమ సంతకాలు లేకుండానే వారే పెట్టేసి రైతులకు ఇస్తుండటం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

గ్రావెల్ తరలిపోతున్నా పట్టించుకోరు ..

పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల పరిధిలో అనధికారికంగా కొందరు మట్టిని టిప్పర్ల ద్వారా తరలించేస్తున్నా అదేమని అడిగే రెవెన్యూ అధికారులే లేరు. గ్రావెల్ తవ్వకాలకు అనుమతులున్నాయో లేదో అడిగిన వారి వివరాలను అవతల వారికి చెప్పేస్తున్నారు. జానపాడు, దైద, కోనంకి, మోర్జంపాడుతో పాటు మరికొన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా గ్రావెల్ తరలిస్తున్నా ఏ రెవెన్యూ అధికారి కూడా అదేమిటనే సాహసం చేయరు.

నకిలీ దందా



- నడ్డివిరిచిన నకిలీ విత్తనాలు
- దుగ్గిరాల రైతులు పూర్తిగా మునిగిపోయారు...
- మిర్చి రైతుల నష్టం అపారం
- కేజీ రూ.6 వేలుకు కొని.. ఇక్కడ రూ.1.20 లక్షలకు అమ్మకం
- ఉద్యోగులకు కంపెనీల్లో వాటాలు
- గుంటూరు నుంచే అన్నిచోట్లకు సరఫరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: విత్తన ఎంపికలోనే రైతు మీద దెబ్బ పడుతోంది. ఏది అసలో ఏది నకిలీనో తెలుసుకోలేని సందిగ్ధావస్థ అన్నదాతను తిప్పలపాలు చేస్తోంది. ఖరీఫ్, రబీ అన్న తేడా లేకుండా రైతులు విత్తనాల విషయంలో మోసపోతూనే ఉన్నారు. విత్తనాల కంపెనీల మాటల ఆకర్షణలో పడి నిండా మునిగిపోతున్నారు. పంట చేతికి రావలసిన సమయానికి మోడుబారిన చెట్లను చూసి గుండె పగులుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నగరంలో నుంచే విత్తనాలు సరఫరా అవుతున్నాయి. వాటిల్లో చాలాభాగం నకిలీవి కూడా ఉంటున్నాయి. ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం ఇక్కడే ఉన్నప్పటికీ పర్యవేక్షణ కరువవ్వటంతో అన్నదాతల బతుకుల్లో బండలు పడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులకు విత్తనాల కంపెనీల్లో వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

రైతు శ్రమ బూడిదలో పోసిన పన్నీరు..

దుగ్గిరాల మండలం మంచికలపూడిలో కొందరు రైతులు క్యాలీఫ్లవర్ సాగు చేశారు. అందుకోసం గుంటూరు నుంచి విత్తనాలను తీసుకువెళ్లారు. 75 రకం, వైట్ సుప్రీమ్ గోల్డ్ విత్తనాలను సాగు చేశారు. పైరు ఏపుగా పెరిగింది కానీ పువ్వు రాలేదు. పెరిగిన పైరు క్రమంగా ఎండిపోయింది. అది గమనించిన రైతు లు స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరు గులు తీశారు. తాము మోసపోయామని గ్రహించారు. ఈ పంట సాగుకు ఒక్కో రైతుకు సుమారు రూ.60 వేల వరకు వరకు ఖర్చయినట్లు తెలుస్తోంది. విత్తనాలు ప్యాకెట్లు కూడా ఒక్కొక్కటి రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేశారు. పెదనందిపాడుకు చెందిన కిషోర్ ఈ ఏడాది మిర్చిపంట సాగు చేశాడు. అన్నవరం సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుకు ఉపక్రమించాడు. మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ కాపు రాకపోవడంతో పంటను ధ్వంసం చేసి శనగ వేసుకున్నాడు. శనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల నుంచే తీసుకున్నప్పటికీ అవి కూడా సరిగా మొల వకపోవడంతో ఆ పంటను తీసేసి మొక్కజొన్న నాటుకు న్నాడు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్ళచెరువు లో కొందరు రైతులు గుంటూరు నుంచి తీసుకువెళ్లారు. మిర్చి విత్తనాలను నారుగా పోశారు. అవి మొలకెత్తక పోవటంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెంటచింతల మండలంలోని కొందరు రైతులు ఇదే అనుభవాన్ని ఎదుర్కొన్నారు. విత్తనాలను విక్రయిస్తున్న డీలర్లు రైతుల్లోని నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్నారు. అందమైన ప్యాకింగ్‌లను చూపించి విత్తనాలను రైతులకు అంట గడుతున్నారు. విత్తనాలు విక్రయించే సందర్భంలో తగినవిధంగా బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు పోరాడే అవకాశాన్ని కోల్పోతున్నారు.

మిర్చి విత్తనాలకు ఇదే సీజన్..

ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రాకు వివిధ రకాల విత్తనాలు ఫిబ్రవరి, మార్చి నెలలోనే సరఫరా అవుతాయి. కర్ణాటకలోని రాణి బెంగళూరు ప్రాంతం నుంచి మిర్చి విత్తనాలను గుంటూరు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అక్కడ మిర్చి విత్తనాలు కేజీ రూ.6 వేలకు కొనుగోలు చేసి ఇక్కడ గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలను కేజీ రూ.లక్షా ఇరవై వేల వరకు అమ్మడం జరుగుతుంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేసి తీసుకొస్తారు. వాటికి యాసిడ్, సున్నం కలిపి ఆరబెట్టిన తర్వాత ప్యాకింగ్ చేస్తారు. వాటిని కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గుంటూరు నగరంలో సుమారు 20వరకు విత్తన కంపెనీలు ఉన్నాయి. విత్తన నాణ్యతను పెద్దగా పరిశీలించకుండానే డైరెక్ట్‌గా మార్కెట్లోకి విడుదల చేయటంతో రైతులు సాగులో నష్టపోతున్నారు.



తనిఖీలు లేవు...

రాష్ట్రాల నుంచి గుంటూరుకు మిర్చి పత్తి విత్తనాలు స్థానిక పార్సిల్ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్నాయి. సరైన రీతిలో తనిఖీలు జరపకపోవడంతో నకిలీ విత్తనాలు మార్కెట్లోకి వెళ్లిపోతున్నాయి. వ్యవసాయ శాఖలోని కొందరు ఉద్యోగులు విత్తన కంపెనీలో వాటాదారులుగా ఉండటంతో తనిఖీలు తూతూ మంత్రంగా సాగుతాయి అన్న అపప్రద ఉంది.

అంబటికి చెక్!?

- సర్వే ద్వారా అధిష్టానం అభిప్రాయ సేకరణ!
- సత్తెనపల్లి తెరపైకి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి
- వైసీపీలో ఇదే హాట్ టాఫిక్

నరసరావుపేట, ఫిబ్రవరి 19: సత్తెనపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ వైసీపీ అభ్యర్థి ఎవరు అనే అంశంపై రచ్చ జరుగుతోంది. జలవనరుల శాఖ మంత్రి అబంటి రాంబాబుకు అధిష్టానం చెక్ పెట్టినట్లేనా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తాజాగా సత్తెనపల్లి వైసీపీలో చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి. సత్తెనపల్లి వైసీపీ తెరపైకి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేరు వచ్చింది. దీంతో కొంతకాలంగా అంబటికి టిక్కెట్ ఇవ్వరనే ప్రచారానికి ఊతమిచ్చినట్లయింది. సత్తెనపల్లి వైసీపీ అభ్యర్థి ఎవరైతే బాగుంటుందన్న విషయమై సర్వే ద్వారా అభిప్రాయ సేకరణ అధిష్టానం సేకరించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. సత్తెనపల్లి నియోజకవర్గానికి మీకు అంబటి కావాలా? పిన్నెల్లి కావాలా? అంటూ సర్వే ద్వారా రెండు రోజుల పాటు అభిప్రాయ సేకరణ జరిగిందన్న అంశాన్ని పార్టీ నేతలు ధ్రువీకరించాయి. అయితే బాపట్ల నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ నిర్వహించిన సర్వేలో కూడా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేరుతో కూడా ఇటీవల సర్వే నిర్వహించారు. రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి వెంకట్రామిరెడ్డి అత్యంత సన్నిహితుడు. తన సోదరుడికి కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా అధిష్టానం వద్ద రామకృష్ణారెడ్డి చేశారు. ఈ నేపథ్యంలోనే బాపట్ల, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో వెంకట్రామిరెడ్డి పేరుపై కూడా అధిష్టానం సర్వే చేయించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

నియోజకవర్గంలో అంబటిపై వ్యతిరేకత తారాస్థాయికి చేరింది. పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద కూడా అంబటికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అంబటికి టిక్కెట్ ఇస్తే ఆయనను ఓడిస్తామని కూడా ఆయన వ్యతిరేకులు అధిష్టానానికి తేల్చి చెప్పారు. వెంకట్రామిరెడ్డి పేరుతో నిర్వహించిన సర్వేలో కూడా మిశ్రమ స్పందన వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్యే మద్దాలి గిరి, గుబ్బా చంద్రశేఖర్ పేర్లు కూడా అధిష్టానం పరిశీలనలోకి తీసుకున్నట్టు ముఖ్యనేతలు చెబుతున్నారు. మొత్తం మీద సత్తెనపల్లిలో వైసీపీ టిక్కెట్ రాజకీయం రసకందాయంలో పడింది. అధిష్టానం నిర్ణయం కోసం నేతలు ఎదురుచూస్తున్నారు. అంబటికి టిక్కెట్ ఇస్తే ఆయనకు వ్యతిరేకంగా పని చేయడం ఖాయమని అసమ్మతి నేతలు స్పష్టం చేశారు. ఇటీవల నరసరావుపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చిలకలూరిపేట మినహా ఎమ్మెల్యేలను అధిష్టానం మార్చడంలేదని తిరిగి అందరూ పోటీ చేస్తున్నారని ప్రకటించిన ఆయన తన సోదరుడి పేరుతో సత్తెనపల్లిలో సర్వే చేయించడం నియోజక వర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

విధ్వంసం తప్పితే అభివృద్ధి శూన్యం

● 1525వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 19: ప్రజావేదిక కూల్చివేతతో సీఎం జగన్‌రెడ్డి పాలన ప్రారంభమైందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1525వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, కూల్చటం, పడగొట్టడం జగన్‌రెడ్డి విధానమన్నారు. ఎంతో శక్తివంతమైన అమరావతిని నాశనం చేయటం ఎవరి తరం కాదన్నారు. ఎప్పటికైనా ఐదుకోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి గుండు సున్నా అని పేర్కొన్నారు. విధ్వంసకర పరిపాలన చేస్తున్న జగన్‌రెడ్డి ఇంటికి పంపటమే లక్ష్యంగా ప్రజలు ఉన్నారన్నారు. దోచుకోవటం ఒక్కటే వైసీపీ పాలకులకు తెలుసునని అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని నాశనం చేయవద్దన్నారు. దోచుకోవటం ఆపి ప్రజాసేవ చేయాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు నిర్వహించారు.

మాచర్లలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోంది

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 19: మాచర్లలో అంబేద్కర్ రాజ్యాంగం నడవడం లేదని, ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఎమ్మెల్యే పీఆర్కే పంపిణీ చేసిన నివేశన స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పీడబ్ల్యూడీ కాలనీలో దశాబ్దాల కాలంగా నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కాదని, తన అనుచరులకు కాలనీలో సుమారు నాలుగు సెంట్ల చొప్పున పిన్నెల్లి సోదరులు దోచి పెట్టారన్నారు. నిబంధనలను కాదని ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌లు, డూప్లెక్స్ హౌస్‌లు నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరూ నిరుపేదలా.. పెత్తందారులా అని ప్రశ్నించారు. నిత్యం నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ ఊదరగొట్టే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీనికేం సమాధానం చెబుతారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే పీడబ్ల్యూడీ కాలనీలో పంపిణీ చేసిన స్థలాలపై, నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించి దశాబ్దాల కాలంగా కాలనీలో నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. చోద్యం చూస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బ్రహ్మారెడ్డి వెంట యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, లెనిన్‌బాబు, మోసిన్, మున్నా రాంబాబు, సాతులూరి కుమార్, బొల్లెద్దుల ప్రకాష్, బాబు, నూకరాజు, శ్రీనివాసరవు, కొమెర శివ తదితరులు ఉన్నారు.



షాపింగ్ కాంప్లెక్స్‌లు, డూప్లెక్స్ హౌస్‌ల నిర్మాణాలను చూపుతున్న బ్రహ్మారెడ్డి

స్వర్ణ యుగమో.. రాతియుగమో తేలుద్దామా?

● కన్నా లక్ష్మీనారాయణ



కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధిపై దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరి పాలన రాతి యుగమో తేల్చాద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేందుకు వైసీపీ నాయకులకు దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి అశుద్ధం మాటలు మాట్లాడుతున్నాడన్నారు. జగన్ ఓటమి భయంతో బదిలీలు అంటూ 77 మందిని మడత పెట్టాడన్నారు. మిగిలిన వారిని 50 రోజుల్లో జనం మడత పెడతారన్నారు. రాష్ట్రంలో ఏ ఊరు వెళ్ళినా వైసీపీ పాలనలో విధ్వంసం కన్పిస్తుందన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధమని సభలు పెడుతున్నాడన్నారు. జగన్ నోటి నుంచి వచ్చేవి అన్ని అసత్యాలు, తప్పుడు ప్రచారాలని తెలిపారు. వార్తలు కవర్ చేసేందుకు వెళ్ళిన మీడియా సిబ్బందిపై దాడి చేయటం దుర్మార్గం అన్నారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, ఐదుకోట్ల మంది ప్రజలకు మధ్య యుద్ధమని కన్నా పేర్కొన్నారు.

భర్తను చంపిన భార్య, ప్రియుడుకి జీవిత ఖైదు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి19: మంగళగిరి మండలం, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన బుల్లా రవి హత్యకేసులో అతని భార్య, ఆమె ప్రియుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ సోమవారం మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.అర్చన తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రవికి ఉద్దండరాయునిపాలేనికి చెందిన రాణితో వివాహం అయింది. పొలం పనులు చేసుకునే రవికి పుట్టుకతోనే మూగ, చెవుడు వైకల్యం ఉంది. పెళ్లి తర్వాత పెనుమాక గ్రామానికి చెందిన కిరణ్‌తో రాణికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంలో భార్యా, భర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోవటంతో రాణి నూతక్కిలో ఉన్న ఆమె అత్త ఇంటికి వెళ్లిపోయింది. కొద్దిరోజులకు తిరిగి వచ్చింది. అయినప్పటికీ కిరణ్‌తో తన వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఎప్పటికైనా భర్త ఉండటం వారి సంబంధానికి ఇబ్బంది అని భావించి, రవిని తుదముట్టించాలనుకున్నారు. 2017 ఆగస్టు 14వ తేదీ ఉదయం రవి తన తండ్రి, భార్య రాణితో కలిసి బెండతోటకు కాయలు కోయటానికి వెళ్లారు. ఆ సమయంలో కిరణ్ వచ్చి రవిని గొంతు పట్టుకొని కింద పడేశాడు. పక్కనే ఉన్న రవి భార్య కొండరాయి తీసుకొని తలపై మోదింది. దీంతో రవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పోలీసుల దర్యాప్తులో నిజాలు తేలటంతో భార్యపై, ప్రియుడిపై కేసు నమోదు చేసి, సీఐ ఎం.మధుసూదనరావు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు రుజువు కావటంతో నిందితులకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసం సూరిబాబు వాదించారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల నిర్వహణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

విజయవాడ, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికలు విజయవంతం కావడానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సూచించారు. విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో సోమవారం తూర్పు గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ స్థాయి మాస్టర్ ట్రెయినర్లు కుముద్‌కుమార్ ఝా, జీ.ఆర్ హరిశిల్పలు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, ఆర్డీవో బీ.హెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఆర్వో, పీవోల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. మాస్టర్ ట్రెయినర్‌లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రణాళికాబద్దంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మందికి శిక్షణా ఇచ్చారని, ప్రస్తుతం ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో 124 మంది ఏఆర్వోలకు శిక్షణా ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ నిబద్ధత అవగాహన ముఖ్యమని చెప్పారు. సంబంధిత అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సమన్వయం ముఖ్యమని, ఒత్తిడిని దూరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్లను కలెక్టర్ సత్కరించారు.



జాతీయ ఎన్నికల నిర్వహణ మాస్టర్ ట్రెయినర్‌లతో కలెక్టర్ ఢిల్లీరావు

దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తుల స్టాల్



దుబాయ్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: గల్ఫ్ దేశాలలో ఒకటైన దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో తెనాలి డబుల్ హార్స్ సంస్థ తమ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేసిన అరుదైన అవకాశం దక్కించుకుంది. ట్రేడ్ సెంటర్‌లో 22వ గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు. 127 దేశాల ఆహార సంస్థల తయారీదారులు వీక్షించేందుకు వచ్చారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శించామని డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ తెలిపారు. ఇటీవల కాలంలో ప్రపంచ ప్రమాణాలను అనుసరించి డబుల్ హార్స్ సంస్థ పలు ఉత్పత్తులు చేపట్టింది. ప్రపంచ మార్కెట్ అవసరాలను భవిష్యత్ వ్యూహాలను అవలంబించేందుకు ఈ ఫెస్టివల్ తమకు దోహదపడిందన్నారు. పలు దేశాల ఉత్పత్తులు, ప్రపంచ ప్రజలకు చేరువ అవుతున్నాయని, తమకు ఈ అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

రేపు వరంగల్‌కి ప్రత్యేక రైలు

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా బుధవారం(ఈ నెల 21వ తేదీన) గుంటూరు నుంచి వరంగల్‌కి ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07016 గుంటూరు - వరంగల్ ప్రత్యేక రైలు బుధవారం ఉదయం 6.40కి బయలుదేరి విజయవాడ, మధిర, మోటుమర్రి, బోనకల్లు, చింతకాని, ఖమ్మం, పాపటపల్లి, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ, చింతపల్లి మీదగా మధ్యాహ్నం 12.30కి వరంగల్ చేరుకొంటుంది. ఈ రైలు అన్ని జనరల్ సెకండ్ క్లాస్ భోగీలతోనే ప్రయాణిస్తుందని సీపీఆర్‌వో తెలిపారు.

24, 25 తేదీల్లో నాలుగు జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 19: పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో ఈనెల 24, 25 తేదీల్లో నాలుగు జిల్లాల స్థాయిలో ఆహ్వాన టెన్నిస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల స్థాయిలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. మొత్తం 70కి పైగా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

చేబ్రోలు, ఫిబ్రవరి 19: వ్యసనాలకు బానిసలై గంజాయి కొనుగోలు చేసి వినియోగించటంతోపాటు, విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ రమేష్ తెలిపారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ ఫజల్, కట్టెంపూడి గ్రామానికి చెందిన నున్నా యశ్వంత్, పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలుడు గంజాయికి అలవాటు పడ్డారు. యడ్లపాడు మండలం, బోయపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి బొమ్మ వద్ద బడ్డీకొట్టు నడుపుతున్న ఒరిస్సాకు చెందిన సరటోల రమాకంత్, ఆషీష్ కుమార్ పాండా వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఇటీవల సత్తెనపల్లికి చెందిన వ్యక్తి కూడా గంజాయి తాగుతూ వీరికి పరిచయం అయ్యాడు. ఈ నెల 18వ తేదీన షేక్ ఫజల్, యశ్వంత్, మరో వ్యక్తి బోయపాలెం వెళ్లి అక్కడ ఒరిస్సాకు చెందిన రమాకాంత్, ఆశీస్‌కుమార్ పాండాల వద్ద రూ.30 వేల విలువైన గంజాయిని కొనుగోలు చేసారు. ఈ గంజాయిని ఫజల్, యశ్వంత్ మరో మైనర్ బాలుడు కలిసి ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులకు విక్రయించాలని పొన్నూరు నుంచి చేబ్రోలు వస్తుండగా మార్గ మధ్యలో సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ మహేష్‌లు తమ సిబ్బంది కొమ్మమూరు కెనాల్ వద్ద వీరిని అదుపులోకి తీసుకొన్ని విచారించినట్లు చెప్పారు. నిందితుల వద్ద కిలో గంజాయి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఫజల్, యశ్వంత్, ఒరిస్సాకు చెందిన రమాకాంత్, అశీస్ కుమార్ పాండ, మైనర్ బాలుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసును చేధించిన సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్ తదితరులు

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిసేంత కసితో రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరి పాలనలో అభివృద్ధి.. ఎవరి పాలనలో విధ్వంసమో.. ప్రజలకు తెలుసని, దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. సీఎం జగన్ సిద్ధం అంటూ సభలు పెట్టి అశుద్ధపు మాటలు చెబుతున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికలు జగన్ చివరి ఎన్నికలు అని, జగన్ టీంను మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పది రూపాయలు ఇచ్చి రూ.100 లాగేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు ఏకోసానా నమ్మే స్థితిలో లేర అన్నారు. దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌రెడ్డికి పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత లేదని తెలిపారు. రాయలసీమలో 52 నియోజకవర్గాల్లో ప్రయాణీకులను ఇబ్బంది పెట్టి పాఠశాలలకు సెలవులు ప్రకటించి ఆర్టీసీ బస్సులు, పాఠశాలల బస్సులను లాగేసి జనాన్ని రాప్తాడు సభకు తరలించాడన్నారు. పాత్రికేయుడిపై దాడి హేయం అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి, ప్రభుత్వ టెర్రరిజం, ల్యాండ్, శ్యాండ్, మైన్, మైనింగ్ మాఫియా, క్విడ్ ప్రోకో, అధిక ధరలు, పనులు, చార్జీల పెంపు, అప్పుల బాదుడు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయని అన్నారు. రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టులన్నీ మూలన పడేసిన జగన్ ఈసారి ఎన్నికలలో ఓటమి తప్పదని యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విదేశాలకు పారిపోయేందుకు జగన్ సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 19: జగన్ పేరు చెబితే రాష్ట్ర ప్రజలకు అవినీతితో పాటు బాబాయి హత్య గుర్తుకొస్తుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి సొమ్ముతో విదేశాలకు పారిపోవడానికి సిద్ధం చేసుకుంటున్నారని అన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని, లక్షల కోట్లు దోచుకున్న నీవు చర్చకు ఎందుకు రావని అన్నారు. నీవు చేసిన ద్రోహానికి షర్మిల మోసపోయి నీపై పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నీ బాబాయి కూతురు నీపై పోరాటం చేసేందుకు సిద్ధమని అన్నారు. త్వరలో మీ కుర్చీ మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అరాచక వ్యక్తులు దాడి చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ ఒక మీడియాకు అధినేత అయి ఉండి కూడా దాడులను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో దాసయ్య, మురళీకృష్ణయాదవ్, ఆయూబ్ ఖాన్, గోవిందరాజులు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు హేయం


● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి19: వైసీపీ అవినీతి అక్రమాలు, ప్రభుత్వంపై ప్రజాగ్రాహాన్ని ప్రజల ముందు బయటపెడుతున్నందునే మీడియాపై దాడులకు తెగబడుతున్నారన్ని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం అన్నారు. రాప్తాడులో జగన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై జరిగిన దాడిని నరేంద్ర కుమార్ తీవ్రంగా ఖండించారు. అలాగే ఇటీవల అమరావతిలో ఈనాడు విలేకరిపై జరిగిన దాడిని ఖండించారు. కొన్ని మీడియాలపై జగన్‌రెడ్డి పెంచుకున్న వ్యతికత, కక్షతో ఈ దాడులు జరగుతున్నాయన్ని ధ్వజమెత్తారు. వృత్తినే దైవంగా భావించి పనిచేస్తున్న పాత్రికేయులపై దాడి చేయించటం అమానుష చర్యగా పేర్కొన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న జగన్‌రెడ్డి ఆయన పార్టీ శ్రేణులు అసహనంతో ఆంధ్రజ్యోతి విలేకర్లపై దాడులకు పూనుకుంటున్నారన్ని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీకృష్ణపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించానల్ని నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

జగన్ ఐదేళ్ల విధ్వంసంపై చర్చకు సిద్ధమా?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 19: సిద్ధ అంటూ ఊరూరా సభలు పెడుతున్న సీఎం జగన్ తన ఐదేళ్ల విధ్వంసం పై చర్చకు సిద్ధమా? అని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు సవాల్ విసిరారు. ప్రజావేదిక కూల్చటంతో మొదలైన విధ్వంసం పోలవరంలో మొదలైన రివర్స్ టెండరింగ్, అమరావతి ఉసురు తీస్తూ మొదలు పెట్టిన మూడు ముక్కలాట, అంతక ముందే కోడి కత్తి డ్రామా, గొడ్డలి వేటు రాజకీయం ఇలా ఎన్ని విధాలుగా జగన్ ప్రజలకు కీడు, రాష్ట్రానికి చేటు చేశారో చెప్పటానికి మేము సిద్ధం, చర్చకు మీరు సిద్ధమా? అని వైసీపీ నాయకుల పైనిప్పులు చెరిగారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచుకోవటమే జగన్ మార్క్ సంక్షేమమా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి వేయటానికకి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికలే తనకు చివరి ఛాన్స్ అని తెలిసి జగన్ అంతులేని దోపిడీకి పాల్పడ్డారన్నారు. ఇసుక, మైనింగ్, మద్యం, కాంట్రాక్టలలో భూ దోపిడీల్లో వేల కోట్లు దోచేశారని, హత్యలు, అరెస్టులు కూల్చివేతల రాజకీయాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించరన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభలో ఆంధ్రజ్యోతి కెమేరామెన్‌పై జరిగిన దాడి అత్యంత హేయమని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

బస్ ఢీకొని వృద్ధురాలి మృతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 19: బస్ ఢీకొని రోడ్డు దాటుతున్న మహిళ మృతి చెందిన ఘటన చెరుకుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం.. చెరుకుపల్లిలోని కొత్తపేటకు చెందిన సుశీల(62) ఐలాండ్ సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. మహిళకు రెండు కాళ్ళు విరగ్గా దగ్గరలో ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. వైద్యం చేస్తుండగానే మహిళ మృతి చెందినట్లు చెప్పారు. సుశీలకు కుమారుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభం

మంగళగిరి, ఫిబ్రవరి 19: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో బీఏ, బీఎస్సీ చదివే విద్యార్థుల కోసం కొత్తగా ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆ వర్సిటీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణన్ చెప్పారు. తన తల్లిగారైన ఈశ్వరీదేవి పేరిట ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన సభలో మాట్లాడుతూ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రత్యేకతలను గురించి వివరించారు. తమ ఈ స్కూల్‌లో కొత్తగా బీఎస్సీ, బీఏ విభాగాలలో వివిధ రకాల కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ వంటి సబ్జెక్టులలో పీహెచ్‌ఏ ప్రోగ్రామ్‌లను కూడ ప్రారంభిస్తున్నామని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ మనోజ్ అరోరా మాట్లాడుతూ తమ ఈ లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పాలకమండలి సభ్యులు డాక్టర్ నికోలస్, డాక్టర్ జానకి బాక్లే, ప్రశాంత్ మహాపాత్రో, డాక్టర్ గోపాల్‌గురు, డాక్టర్ చందన్‌గౌడ, డాక్టర్ ప్రదీప్ ఖోస్లా, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డీన్ విష్ణుపధ్ తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సత్యనారాయణన్, నికోలస్, ప్రశాంత్ మహోపాత్ర, వీసి మనోజ్‌కుమార్ తదితరులు

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,48,759 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,33,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 95,912 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	--	--
334	9500	19500	**నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ**		
నెంబరు. 5	14500	17500	తేజ	8000	21000
273	12500	18500	బ్యాడిగి	11000	20000
341	9000	21500	దేవనూరుడీలక్స్	11000	20200
4884	--	--	తెల్లకాయలు	5000	13000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వైసీపీ అరాచక విధ్వంస పాలనపై చర్చకు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుపై చేసిన ఆరోపణలు దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక విధ్వంస పాలనపై చర్చకు తాము సిద్ధమన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెడుతూ జగన్ చెబుతున్న అసత్యాలను నిగ్గు తేల్చేందుకు తాము సిద్ధమన్నారు. బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారాలు కాదు, దమ్మంటే బహిరంగ చర్చకు రావాలన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరి పాలన రాతి యుగమో చర్చిద్దామని. ఊరికే సవాళ్ళు విసరటం కాదని, చర్చకు వచ్చే దమ్ముందా? అన్నారు. రాష్ట్రంలో అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం తప్ప జగన్ సాధించింది శూన్యమని, రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్‌ను గద్దె దించటం ఖాయమని ఆయన అన్నారు.

కొమ్మాలపాటి శ్రీధర్‌ను గెలిపించుకుంటాం

● అమరావతి మండల పార్టీ శ్రేణుల ఏకగ్రీవ తీర్మానం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అమరావతి, ఫిబ్రవరి 19: 18 సంవత్సరాలుగా పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు సేవలు చేస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సహకారం అందిస్తూ పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని టీడీపీ మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం స్థానిక జేబీ గార్డెన్‌లో జరిగిన మండల స్థాయి టీడీపీ ఆత్మీయ సమావేశంలో నాయకులు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమానికి తెలుగురైతు నాయకులు కె.వసంతరావు అధ్యక్షత వహించారు. సంగం డైయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, టీడీపీ మండల అధ్యక్షులు మల్లాది విష్ణు తదితరులు శ్రీధర్‌కు మద్దతుగా తమ అభిప్రాయాలను తెలిపారు. గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకూరపాడు సీటును కొమ్మాలపాటికే కేటాయించాలి

● గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెన్నా సాంబశివారెడ్డి, హాజరైన మండల నాయకులు

బెల్లంకొండ, ఫిబ్రవరి 19: నియోజకవర్గ టీడీపీ సీటును కొమ్మాలపాటి శ్రీధర్‌కే కేటాయించాలని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల నాయకుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వెన్నా సాంబశివారెడ్డి హాజరై మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి పెదకూరపాడు నియోజకవర్గాన్ని అంటి పెట్టుకొని ప్రతి కార్యకర్తకు అండగా కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నారని అన్నారు. బెల్లంకొండ మండలంలో కొమ్మాలపాటి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వెన్నా వివరించారు. టీడీపీ సీటును కొమ్మాలపాటి శ్రీధర్‌కు కేటాయిస్తే విజయానికి కృషి చేస్తామన్నారు. మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ కొమ్మాలపాటి శ్రీధర్‌కే సీటు కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తెలుగుదేశంయువత అధ్యక్షుడు సలాం, బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, సర్పంచ్ జ్యోతి సముద్రం, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, గుడిసె కొండయ్య, వెన్నా వెంకటరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, సయ్యద్ జబ్బార్, సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం : డీఈవో వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 19: వచ్చే నెలలో జరుగును న్న పదో తరగతి పరీక్షలకు పల్నా డు జిల్లా వ్యాప్తం గా 127పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న ట్లు డీఈవో ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల జడ్పీ హైస్కూల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ విద్యార్థులు 25, 206 మంది, 4,038 మంది ప్రైవేటు విద్యార్థులతో కలిపి మొత్తం 29,244 మంది హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రాథమిక పాఠశాల దశ నుంచే ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన కొనసాగించాలని ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఇస్తుందన్నారు. 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందటం లేదని పాత్రికేయులు ప్రశ్నించగా ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశంలో తీర్మానం అయిందని, త్వరలోనే అల్పాహారం పెట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పాత ధరలే అందిస్తున్నారని, పెరిగిన కొత్త ధరలతో పోల్చి కొత్త ధర చెల్లిస్తే బాగుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు విజయసారథి, సత్యనారాయణరాజు, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ గర్జన సభను జయప్రదం చేయాలి

దాచేపల్లి, ఫిబ్రవరి 19: బీసీ గర్జన సభను జయప్రదం చేయాలని బీసీ సంఘ నాయకులు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సోమవారం దాచేపల్లిలో బీసీ సంఘ నాయకులు అక్కినపల్లి బాలయ్య ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గ బీసీ సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన పిడుగురాళ్లలో జరిగే గురజాల నియోజకవర్గ బీసీ గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా కేశన శంకరరావు, కుమ్మరి క్రాంతికుమార్ యాదవ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయంపై నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. కావున అన్ని బీసీవర్గాలకు చెందిన నాయకులు పార్టీలకు అతీతంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

బీసీల ఆత్మగౌరవం జగన్‌కు తాకట్టుపెట్టిన అనిల్‌యాదవ్

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: బీసీల ఆత్మగౌరవాన్ని, మనోభావాలను జగన్‌కు అనీల్‌కుమార్ యాదవ్ తాకట్టు పెడుతున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడులో జైజగన్ అనలేదని రామ చంద్రయ్య యాదవ్‌ను వైసీపీ నేతలు దారుణంగా హత్య చేశారన్నారు. పల్నాడుజిల్లాలో యాదవులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు వైసీపీ నేతలు చేశారన్నారు. చంద్రబాబును తిట్టడం, జగన్ భజన చేయటం తప్ప బీసీల అభ్యున్నతికి ఏం చేశారో చెప్పాలన్నారు. పల్నాడులో వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పటం ఖాయమని ఆయన అన్నారు.

9 మంది టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసు

రెంటచింతల, ఫిబ్రవరి 19: మండలంలోని మంచికల్లు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు 9మందిపై 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సమాచారం. వారిలో గోగుల వెంకట్రామిరెడ్డి, పల్లెర్ల శ్రీనివాసరెడ్డితో పాటు మరో ఏడుగురు ఉన్నారు. ఆదివారం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పోస్టర్లను ఇంటి తలుపులకు అంటిస్తున్న సమయంలో రెండు పార్టీల మధ్య వివాదం చెలరేగింది. ఈ ఘటనలో వైసీపీకి చెందిన మేకపోతుల ఈశ్వరరెడ్డిపై దాడి జరిగింది. దీనికి సంబంధించిన కేసు నమోదు చేశారు.

జగన్ సిద్ధానికి తెలుగుదేశం సంసిద్ధం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు నాయకత్వంలో రూ.1200 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి కన్నా గెలవటానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు మంత్రి అంబటి సిద్ధమా? అన్నారు. సభలో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్‌పై దాడిని ఖండించారు.

మోర్జంపాడులో రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన

మాచవరం, ఫిబ్రవరి 19: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు మంగళవారం నుంచి నిర్వహిస్తారని కమిటీవారు సోమవారం తెలిపారు. జత పండ్ల విభాగం, నాలుగు పండ్ల విభాగం, పాలపండ్ల దూడలు, సేద్య విభాగం, సబ్‌జూనియర్స్ సైజు, సీనియర్స్ సైజు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

● టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

● గ్రామాల్లో పార్టీ మ్యానిఫెస్టోపై ప్రచారం



నకరికల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో రానున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమితో ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమని సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజలందరూ టీడీపీ, జనసేన కూటమిని బలపరచాలని కన్నా పిలుపునిచ్చారు. నకరికల్లులో తొలుత రామదాసు కాలనీలో గల వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కన్నా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు అభివాదం చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టోలో పొందు పరిచిన విషయాలను వివరించారు. కన్నాకు నకరికల్లులో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, నాదెండ్ల సత్యనారాయణ, వేల్పుల రాజు, బీ హుస్సేన్‌బీ, ఎస్‌కే ఆలీ బాషా, ఉషా, జీ వెంకటరావు, అట్లూరి పుల్లమ్మ, కోటేశ్వరరావు, పలువురు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

విజయం సాధించేలా.. కలిసికట్టుగా పని చేయాలి

రాజుపాలెం, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో విజయం సాధించేలా అందరూ కలిసికట్టుగా పని చేయాలని కన్నా లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం రాజుపాలెంలో పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలపై దృష్టి పెట్టి అందరిని కలుపుకొని వచ్చి విజయం వైపు నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నా కుమారుడు మాజీ మేయర్ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి, జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, నియోజకవర్గ నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్, మాజీ ఎంపీపీలు గుత్తా వెంకట్రావు, నర్రా బాబురావు. పార్లమెంటు కమిటీ సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహరావు, సర్పంచ్ కణదం శ్రీను, నియోజకవర్గ అధికారప్రతినిధి షేక్ అల్లాబక్షు తదితరులున్నారు.

కన్నా పరామర్శలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని గుడిపూడికి చెందిన మానుకొండ కోటయ్య, కంచేటి బాబులు అనారోగ్య కారణంగా గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమాచారాన్ని తెలుసుకున్న కన్నా లక్ష్మీనారాయణ వైద్యశాలకు వెళ్లి వారిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కట్టమూరుకు చెందిన షేక్ అతుల్‌ను పరామర్శించారు. కన్నాతో పాటు గద్దె అప్పారావు, మందలి కాశీప్రసాదు తదితరులు ఉన్నారు.

● రాజుపాలెం గ్రామానికి చెందిన చొక్కా చిన్నపిచ్చయ్య ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందారు. సోమవారం దశదిన కార్యక్రమంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ పిచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా కన్నా నాగరాజు కోట నెమలిపురి గ్రామానికి చెందిన పొట్లసిరి రామలింగయ్య మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళర్పించారు.

పరివర్తనలో విద్యార్థులకు దుస్తులు, పండ్లు పంపిణీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లవరపు కిషోర్ ఆధ్వర్యంలో పూదోట సుస్మిత పుట్టిన రోజు సందర్భంగా పరివర్తన పాఠశాలలో కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపేందుకు కలిసి నడవాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 19: పలు రకాల పన్నులతో వేధిస్తూ పేదల రక్తాన్ని జలగల్లా పట్టి పీడిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు యువత, మహిళలు టీడీపీతో కలిసి రావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 6, 7 వార్డుల్లో గల ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన 40 వైసీపీ కుటుంబాలు సోమవారం ఆ పార్టీని టీడీపీలో చేరారు. వారికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. ఇది ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి వెంట యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, లెనిన్‌బాబు, మోసిన్, మున్నా రాంబాబు, సాతులూరి కుమార్, బొల్లెద్దుల ప్రకాష్, బాబు, నూకరాజు, శ్రీనివాసరవు, కొమెర శివ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

విలేకరులపై దాడులు దుర్మార్గం

విలేకరులపై దాడులు చేయడం దుర్మార్గమని జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో విలేకరులపై దాడులు పెరిగాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేసి గాయపరచడం బాధాకరమన్నారు. ఈ దాడిని ప్రభుత్వం ఖండించకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి సభలో దాడి జరగడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి పులి హరి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను ఆపాలి

● నిరసన ర్యాలీలు, మానవహారం ఏర్పాటు

● తహసీల్దార్, డీఎస్పీలకు వినతిపత్రాల అందజేత



సత్తెనపల్లి పట్టణంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టు కృష్ణపై దాడిని, అమరావతిలో మరో జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని జర్నలిస్టులు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాదుకు, డీఎస్పీకి అందించారు. జర్నలిస్టులపై దాడిని టీడీపీ, జనసేన నేతలు కంభాల వెంకటేశ్వరరావు, చవిటి భవన్నారాయణ, పసుపులేటి వెంకటస్వామి, తొరటి వెంకటరావు, నోముల ప్రకాష్‌లు కూడా ఖండించారు.

మాచర్ల, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి కెమెరామెన్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ మాచర్లలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు భువన్ మాట్లాడుతూ సామాన్యులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలే దాడులను ప్రోత్సహిస్తే ఎలా అని నిలదీశారు. విజ్ఞతతో పరిపాలించాల్సిన ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తే రెండు పత్రికలు, రెండు ఛానళ్లను తన ఆగర్భ శత్రువులుగా పలు ప్రసంగాల్లో పేర్కొనడం ఆందోళనకరమన్నారు. ఈ క్రమంలోనే వైసీపీ మూకలు విలేకరులపై దాడులకు తెగబడుతున్నాయన్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో ధర్నాకు దిగి డిప్యూటీ తహసీల్దార్ బాషాకు వినతిపత్రం అందించారు.

గురజాలటౌన్, ఫిబ్రవరి 19: పాత్రికేయులపై దాడులను వెంటనే ఆపాలని గురజాల ప్రెస్ క్లబ్ నేతలు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ నేతల దాడిని వారు ఖండించారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో డీటీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందించారు.

క్రోసూరు, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణ, అమరావతి విలేకరి పరమేశ్వరరావుపైన జరిగిన దాడిని క్రోసూరు మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఖండించింది. మహాజన సోషలిస్టు పార్టీ మండల శాఖ అధ్యక్షులు జడ సుబ్బయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికా, మీడియా రంగాల్లో దాడులు చేయటం అంటే అది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టులాంటిదన్నారు.

దాచేపల్లి, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయ డం సభ్యసమాజానికి సిగ్గుచేటని ప్రతిపక్ష నేతలు తీవ్రంగా విమర్శిం చారు. సోమవారం టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాపు సంఘం నాయకుడు ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ విలేకర్లపై దాడులను ప్రతిఒక్కరు తీవ్రంగా ఖండించాలన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి, ఫిబ్రవరి 19: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వెల్దుర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల ప్రధానోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 19: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. గ్రామ, వార్డు వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను ప్రదా నం చేశారు.

రెంటచింతల, ఫిబ్రవరి 19: మండలంలోని యర్రబాలెంలోని షాదీఖానాలో వలంటీర్లకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ పాముల సంపూర్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పీఆర్కే ప్రసంగించారు.

మాచవరం, ఫిబ్రవరి 19: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శివయాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూపూడి నోరు అదుపులో పెట్టుకోవాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న జూపూడి ప్రభాకర్ అంబేద్కర్ విదేశీ విద్య పేరును మార్చటాన్ని సమర్థిస్తూ ప్రకటన చేయటాన్ని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్, దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొర బండి ఆంతోనిలు ఖండించారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి జగనన్న విదేశీ విద్యగా మార్చటం దుర్మార్గం అన్నారు. ఇది భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించటమేనన్నారు. రాజకీయ రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందిన రాజకీయ దళారి జూపూడి దళితుల ఆత్మ గౌరవాన్ని జగన్ వద్ద తాకట్టు పెట్టాన్నారు. రాజకీయ స్థిరత్వం లేకుండా పార్టీలు మార్చే ప్రభాకర్ తన నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రభాకర్ వ్యాఖ్యలను మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు ఆశీర్వాదం ఒక ప్రకటనలో ఖండించారు.

ఉజ్వల యోజన ప్రారంభం

దుర్గి, ఫిబ్రవరి 19: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా మోదీ పేదల కు ఉచితంగా గ్యాస్ అందించే కార్యక్రమాన్ని సోమవారం దుర్గిలో బీజేపీ నేతలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిధిలో సుమారు 40 మంది లబ్ధిదారుల కు గ్యాస్ సిలిండర్, స్టవ్ అందించారు.

మీ బిడ్డల భవిష్యత్ కోసం మేల్కొనండి

● మాజీ మేయర్ కన్నా నాగరాజు

రాజుపాలెం, ఫిబ్రవరి 19: మీ బిడ్డల భవిష్యత్ కోసం ఎస్సీలంద రూ మేల్కొనాలని మాజీ మేయర్ నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు గ్రామంలోని ఎస్సీల నివాస గృహాలకు వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించి చంద్రబాబునాయుడను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

దుర్గి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కౌసల్య

కారంపూడి, దుర్గి, ఫిబ్రవరి 19: దుర్గి మార్కెట్ యార్డు చైర్మన్‌గా కారంపూడికి చెందిన కొమ్ము కౌసల్య నియమితులయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా మండలంలోని గాదెవారిపల్లెకు చెందిన గురజాల రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు మాచర్ల పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం రామారావుకు నియామక ఉత్తర్వులు అందించారు. కమిటీ సభ్యులుగా బొల్లెద్దు ఇన్నయ్య, చింతా లక్ష్మీనరసయ్య, కందుకూరి కాశమ్మ, బోయిన నరసమ్మ, రమావత్ లక్ష్మీబాయి, మాచర్ల అన్నపూర్ణమ్మ, బైనబోయిన గోపమ్మ, దేవరకొండ సామ్రాజ్యం, బత్తుల రాజమ్మ, జానమ్మ, కాయితి వెంకటరెడ్డి, కపలవాయి సూర్యనారాయణ, చింతా చిననరసింహారావులు నియమితులయ్యారు.

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది : ధారూనాయక్



పార్టీలో చేరిన వారితో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 19: వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ అన్నారు. మండలంలోని అచ్చమ్మకుంటలో సోమవారం 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ధారునాయక్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధారునాయక్ మాట్లాడు తూ రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు, వలసలు ఎక్కువయ్యాయని, ఇవి ఆగాలంటే టీడీపీ రావాలని ప్రజలకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్టీలపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. గిరిజనులకు సంబంధించిన 16 సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో పాటు సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. తాగునీటి సమస్య, సీసీ రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి కాలయాపన చేస్తున్నారన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. పార్టీలో చేరిన వారిలో రమావత్ చిన బాలునాయక్, థౌర్యానాయక్, గుండాల రంగయ్య, వడితె చిన్ననాయక్, సభావత్ కసిన్యానాయక్, మొగిలి వెంకటేశ్వర్లు, మేకల పుల్లయ్య, బాణావత్ రూప్‌సింగ్, ముని, లాలు, కొర్రబాలు తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీనివాస్ యాదవ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి పనులకు టీటీడీ సాయం

పెదకూరపాడు, ఫిబ్రవరి 19 : పెదకూరపాడు నియోజకవర్గంలో ఆలయాలు, కల్యాణ మండపాలు వంటి అభివృద్ధి పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పెద్ద ఎత్తున సాయం అందుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరులో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డితో కలసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ అమరావతి మండలం వైకుంఠపురంలో ఆలయ అభివృద్ధికి, క్రోసూరులో కూడా రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మించ బోతున్నామన్నారు. ఆలయాలను అభివృద్ధి కోసం అన్ని గ్రామాల్లో శ్రీవాణి ట్రస్ట్ నిధులు అందుతున్నాయ ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటంలో కృషి చేస్తున్నానన్నారు. రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు గుత్తికొండ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-1 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... (1) పెద్దాల సాంబయ్య గారి కుమారుడు పెద్దాల అంజిబాబులు, (2) పెద్దాల సాంబయ్య గారి కుమారుడు పెద్దాల చంద్రశేఖర్ గార్ల ఆస్తిని తనఖా పెట్టుకొని పెద్దాల శశి దేవి గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు పెద్దాల శశి దేవి గారికి ఋణము మంజూరు చేయుదు. షెడ్యూలు : గుంటూరు డి., ప్రత్తిపాడు సబ్ డి., కొర్నెపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరి ప్రస్తుతం కొత్త మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన కొరిటెపాడు గ్రామ డి.నెం. 109/5 రు. య. 4-84 సెంట్లు విస్తీర్ణములో య. 2-00 సెంట్ల భూమిలో (Regional Deputy Director of Town and Country Planning Govt.of A.P. Guntur) వారి లే -అవుట్ పెర్మిట్ నెం. 893/2013వ ప్లాను నెంబరు "సాయి గోల్డెన్ సిటీ"లోని యీ రోజున మీకు మేము విక్రయించి స్వాధీనపరచిన నెం. [illegible] ప్లాటు చ.గ. 264 [illegible] స్థలమునకు హద్దులు తూర్పు : ప్లాను రోడ్డు హద్దు అ. 34-0లు, దక్షిణం : ప్లాను నెం. 36వ ప్లాటు స్థలము హద్దు అ. 70-0లు, పడమర : ప్లాను అ. 33లు వెడల్పు గల రోడ్డు హద్దు అ. 34-0లు, ఉత్తరం : ప్లాను నెం. 34వ ప్లాటు స్థలము హద్దు అ.70-0లు. ఈ హద్దుల మధ్య గల చ.గ. 264లు లేక చ.మీ. 220-73లు గల ఖాళీ నివేశన స్థలము మాత్రం. DOC NO: 2805/2014, S.R.O. ప్రత్తిపాడు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, చిలకలూరిపేట బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... షేక్ హిమాంసా బజీ గారి భార్య గౌసియా గారి ఆస్తిని తనఖా పెట్టుకొని షేక్ సద్దాం హుస్సేన్ గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు షేక్ సద్దాం హుస్సేన్ గారికి ఋణం మంజూరు చేయుదు. షెడ్యూలు : ప్రకాశం రిజిస్ట్రేషన్ జిల్లా, బల్లికురవ మండలము, మార్టూరు సబ్ డిస్ట్రిక్ట్, బల్లికురవ గ్రామ పంచాయితీ, బల్లికురవ గ్రామ స.నెం. 45/1.ఎ రు య. 0.70 సెంట్లు విస్తీర్ణములో డోర్ నెం. 1-42బి దీని సమీపముగా గల నీకు విక్రయించి స్వాధీన పరచిన స్థలమునకు హద్దులు తూర్పు : [illegible] బాపులు గారి స్థలం హద్దు బారున 92 లింకులు (60.72') దక్షిణం : కోలా రుబేసు గారి స్థలం హద్దు బారున 66 లింకులు (43.56'), పడమర : షేక్ నాగూర్ వలి గారి స్థలం హద్దు బారున 92 లింకులు (60.72'), ఉత్తరం : బజారు హద్దు బారున 86 లింకులు, (56.76') ఈ హద్దుల మధ్య గల విస్తీర్ణం చ.గ॥ 338.4లు (282.902 చ.మీ) మూడు వందల ముప్పది ఎనిమిది పాయింటు నాలుగు చదరపు గజముల స్థలము మాత్రం. DOC NO: 760/2011, S.R.O. మార్టూరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, చిలకలూరిపేట బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... దుద్దుకూరి మల్లికార్జునరావు గారి భార్య వెంకట రమాదేవి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని దుద్దుకూరి మల్లికార్జునరావు గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు దుద్దుకూరి మల్లికార్జునరావు గారికి ఋణం మంజూరు చేయుదు. షెడ్యూలు : నరసరావుపేట ఆర్.డి., చిలకలూరిపేట సబ్.డి., యిలాకా చిలకలూరిపేట మునిసిపాలిటీ 33వ బ్లాకు చెంచిపర్తి, పురుషోత్తమపట్నం గ్రామ డి.నెం. 225/3 దాఖలా ఈ రోజున నీకు నేను విక్రయించి స్వాధీనపరచిన చిలకలూరిపేట మునిసిపల్ డోరు నెం. 33-541వ గల ఇంటికి సమీపముగ గల స్థలం హద్దులు తూర్పు : షేక్ సుభాన్బీ గారి స్థలం హద్దు. లిం 18లు, దక్షిణం : దుద్దుకూరి వెంకట రమాదేవి (నీ బాబుకు) స్థలం హద్దు. లిం. 90లు, పడమర : బజారు హద్దు. లిం 18లు, ఉత్తరం : షేక్ ఖాశిం గారి ఇల్లు హద్దు. లిం90లు, ఈ హద్దుల మధ్య చ.గ 78.40లు స్థలం సదరు స్థలంకు సరియగు చ.మీ. 65.54లు స్థలం మాత్రం. DOC NO: 2259/2011, S.R.O. చిలకలూరిపేట.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

sf | సుందరం హోమ్

సమోదిత కార్యాలయం: నం.21, పటుల్లాస్‌రోడ్, చెన్నై - 600002
కార్పొరేట్ కార్యాలయము: సుందరం టవర్స్, నం.46, వైట్స్ రోడ్, చెన్నై - 600014, ఫోన్: 044-28515267

శాఖ కార్యాలయం: న్యూ నం. 35-065-309, డి.నం. 7-1202(4), మంగమూరు డొంక, హరిహరనగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523002. ఫోన్: 08592-283959.

అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్షన్ 13(2)తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** అధీకృత అధికారి సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తంను తిరిగి చెల్లించవల్సిందిగా ఋణ గ్రహీత మరియు సహ-ఋణగ్రహీతలను కోరుతూ **30.05.2023** తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేశారు.

సదరు చట్టబద్ధకాలంలోగా మొత్తమును తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత మరియు సహ-ఋణగ్రహీత విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8కి అనుగుణంగా సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను ఉపయోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 & 9 క్రింద **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే"** నిబంధనపై **11.03.2024**న 15.00గం.వరకు ప్రజల నుండి సీల్డు బిడ్లు కోరడం ద్వారా దిగువ పట్టికలో పూర్తిగా వివరించిన ఆస్తిని విక్రయించుటకు నిర్ణయించడమైనదని ప్రజలకు సమాచారం ఇవ్వడమైనది. వేలం అమ్మకంలో పాల్గొనగోరు వారు **11.03.2024**న 15.00గం.వరకు లేదా అలోగా దిగువ సంతకందారుకు **శ్రీ మహబూబ్ జిలాని భాష షేక్** అసెట్ ఖాతా విక్రయానికి ఆఫరుగా సీల్డు కవర్‌లో అధీకృత అధికారి "సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్", నం.23, కెథడ్రాల్ గార్డెన్ రోడ్, నుంగంబాకం, చెన్నై-600034 చిరునామాకు KYC డాక్యుమెంట్లతో RPAD ద్వారా మాత్రమే వారి బిడ్లను పంపవలెను.

11.03.2024న 15.00గం.వరకు తరువాత స్వీకరించబడిన టెండర్లు తిరస్కరించబడును. **11.03.2024**న 15.00గం.వరకు RPAD ద్వారా స్వీకరించబడిన సీల్డు బిడ్లు దిగువ తెలిపిన ప్రదేశం **11.03.2024**న 15.30గం.వరకు తెరువబడును. గెలుపొందిన బిడ్డరు సమాచారం స్వీకరించిన తేదీ నుండి 15 రోజులలోగా మిగిలిన మొత్తాన్ని చెల్లించవలెను. పైన తెలిపిన విధంగా మిగిలిన మొత్తం చెల్లించిన తరువాత మాత్రమే అమ్మకం పూర్తి చేయబడును.

ఋణగ్రహీత & సహఋణగ్రహీత పేరు మరియు చిరునామా	సెక్యూర్డ్ ఋణం (రూ.)	ఆస్తి కొరకు ఖరారు చేసిన రిజర్వు ధర	టైటిల్ పరిశీలన ప్రదేశం
శ్రీమతి షేక్ రేష్మా భాను (సహ-ఋణగ్రహీత, భార్య సహిత న్యాయవారసురాలు స్వర్గీయ మహబూబ్ జిలాని భాష షేక్, డి.నం. 1-323, ఇస్లాంపేట-1 ఎక్స్‌టెన్షన్, పోస్ట్ ఆఫీస్ రోడ్, మదీనా మసీదు వెనుకవైపు, ఒంగోలు, ప్రకాశం - 523001. **శ్రీమతి షేక్ రేష్మా భాను,** (సహ-ఋణగ్రహీత & ఆస్తి) భార్య సహిత న్యాయవారసురాలు స్వర్గీయ మహబూబ్ జిలాని భాష షేక్, ప్లాట్ నం.లు 5 & 6,సర్వే నెం.లు 205/3బి మరియు 206/1ఎ, పేర్నమిట్ట, వార్డు నం.40, లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్డుకు ఎదురుగా, కర్నూల్ రోడ్, అమరావతి నగర్, పేర్నమిట్ట ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, పేర్నమిట్ట, ఒంగోలు-523001. **బేబి షేక్ జోయ అల్లిమా,** కూతురు సహిత న్యాయ వారసురాలు స్వర్గీయ మహబూబ్ జిలాని భాష షేక్, డి.నం. 1-323, ఇస్లాంపేట-1 ఎక్స్‌టెన్షన్, పోస్ట్ ఆఫీస్ రోడ్, మదీనా మసీదు వెనుకవైపు, ఒంగోలు, ప్రకాశం - 523001. **మాస్టర్ షేక్ జాబేర్,** కుమారుడు సహిత న్యాయ వారసుడు స్వర్గీయ మహబూబ్ జిలాని భాష షేక్, డి.నం. 1-323, ఇస్లాంపేట-1 ఎక్స్‌టెన్షన్, పోస్ట్ ఆఫీస్ రోడ్, మదీనా మసీదు వెనుకవైపు, ఒంగోలు, ప్రకాశం - 523001. **మాస్టర్ షేక్ అబ్దుల్ జీషాన్,** కుమారుడు సహిత న్యాయ వారసుడు స్వర్గీయ మహబూబ్ జిలాని భాష షేక్, డి.నం. 1-323, ఇస్లాంపేట-1 ఎక్స్‌టెన్షన్, పోస్ట్ ఆఫీస్ రోడ్, మదీనా మసీదు వెనుకవైపు, ఒంగోలు, ప్రకాశం - 523001.	20.02.2024 నాటికి రూ.21,96,485/- (రూపాయలు ఇరవై ఒక్క లక్షల తొంభై ఆరు వేల నాలుగు వందల ఎనభై ఐదు మాత్రమే) + భవిష్యత్ వడ్డీ + చట్టబద్ధమైన ఖర్చులు+ న్యాయపరమైన వ్యయాలు+ అనుషంగిక చార్జీలు	రూ.18,79,000/- (రూపాయలు పద్దెనిమిది లక్షల డెబ్బై తొమ్మిది వేలు మాత్రమే)	సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్., న్యూ నెం. 35-065-309, డి.నం. 7-1202(4), మంగమూరు డొంక, హరిహరనగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523002.
		బయానా	బిడ్ తెరుచు ప్రదేశం
		బిడ్ మొత్తంలో 25 శాతం	సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, నం.23, రెండవ అంతస్తు, కెథెడ్రల్ గార్డెన్ రోడ్, నుంగంబాక్కమ్, చెన్నై-600 034
			బిడ్ తెరచు తేది & సమయం
			11.03.2024న 15:30 గం.లకు

సెక్యూర్డ్ ఆస్తి వివరణ : గుంటూరు జిల్లా, నరసారావుపేట రెవెన్యూ డివిజన్, అమరావతి మండలం, ఎండ్రాయి గ్రామం, "శ్రీ శ్రీనివాస బృందావనం" లోని సబ్ డివిజన్ డి.నం.60-1బి, డిమార్కేషన్ నెం.60-1, 426.66 చ.గ.ల విస్తీర్ణం, ప్లాట్ నం.2 &3 గల ఆస్తి యావత్తు. సరిహద్దులు : తూర్పు : ఇతరుల ఆస్తి - 60, పశ్చిమం : 40 అ. వెడల్పు రోడ్-60, ఉత్తరం : ప్లాట్ నం.1-64, దక్షిణం : ప్లాట్ నం.4-64, టైటిల్ డీడ్ నం.1831/2019, ఎస్ఆర్ఓ అమరావతిలో మరింత పూర్తిగా మరియు స్పష్టంగా వివరించబడింది.

గమనిక: కాగోరు కొనుగోలుదారులు ఆస్తికి సంబంధించిన టైటిల్,స్వభావం మరియు స్థితి గురించి సంతృప్తి చెందిన తర్వాత మరియు ఆస్తి డాక్యుమెంట్లు తనిఖీ తరువాత వేలంలో పాల్గొనవలసిందిగా కోరబడుచున్నారు. ఆస్తి,టైటిల్, స్వభావంకు సంబంధించి ఏదేని వివాదం ఉత్పన్నం అయినచో అమ్మకం నిర్ధారణ తరువాత రీఫండ్ ఇవ్వబడదు.

ఆస్తి అమ్మకం యొక్క నియమనిబంధనల వివరాల కొరకు శ్రీ మహబూబ్ జిలాని బాషా షేక్,ఋణఖాతా నం. ONG20190052, www.sundaramhome.in/uploads/files ONG20190052 sale_notice/.pdf దర్శించండి.

సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ గిరిరాజ్ చారి - 9553441464

తేది: 20.02.2024

సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి తరఫున

విషజ్వరాలతో ఇర్లపాడు విలవిల

ఇర్లపాడు (శావల్యాపురం) ఫిబ్రవరి 19: మండలంలోని ఇర్లపాడులో విషజ్వరాలతో నెలరోజుల నుంచి ప్రజలు విలవిలలాడుతున్నారు. కుటుంబంలో ఒకరికి జ్వరం రావడం అది కుటుంబ సభ్యుల మొత్తానికి సోకడంతో కుటుంబమంతా ఆసుపత్రుల పాలై ఇబ్బందులు పడుతున్నారు. గ్రామసర్పంచ్ వెనిగండ్ల రమాదేవి, నన్నపనేని శివయ్య కంచేటి వెంకటనారాయణ, మన్యం వెంకటేశ్వర్లు, వెలగపూడి దాతయ్య, బిక్కి చిన్నయ్య, రాయపాటి ప్రసాదు, మాగం సాంబశివరావు, పూర్ణచంద్రరావు, నాగయ్య తదితర కుటుంబాలకు చెందిన 100మందికి పైగా విషజ్వరాల బారినపడి వినుకొండ, నర్సరావుపేటలలోని ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. బిక్కి కనీసరావుకి జ్వరం రావడంతో కణాలు పడిపోయి నర్సరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ గుండెపోటు రావడంతో పరిస్థితి విషమంగా మారిందన్నారు. గ్రామంలో ఇంత దారుణ పరిస్థితి నెలకొన్నా ఏఎన్ఎం గానీ, సూపర్‌వైజర్‌లు గానీ, సీహెచ్‌వో గానీ గ్రామంలోకి తొంగిచూసిన దాఖలాలే లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నాలుగు రోజుల క్రితం మురికికాలువలలో పూడిక తీయించామని, దోమల నివారణకు మందులను పిచికారీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోమటినేని అశోక్‌చౌదరి తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జగనన్నకు చెబుదాం స్పందనకు 120 ఫిర్యాదులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీ శ్రీనివాసరెడ్డి, పీఏటీ టూ స్పెషల్ కలెక్టర్ నారదముని, తదితరులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు 120మంది ఫిర్యాదు అందజేశారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం: ఏఎస్పీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 19: జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించటానికి కృషిచేయాలని సంబంధిత అధికారులను పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర కోరారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

వెల్లటూరులో మెగా మెడికల్ క్యాంపు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని వెల్లటూరులో ఎస్వీ చారిటీ, కాటూరి మెడికల్ కళాశాల హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి సోమవారం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ఎస్వీ చారిటీ వారి ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమలను ఆమె కొనియాడారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కళాశాల మెడికల్ సిబ్బంది, ఎస్వీ చారిటుబల్ సభ్యులు, పార్టీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, ఆళ్ల మన్నెయ్య తదితరులు పాల్గొన్నారు.

నవోదయంతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు: కలెక్టర్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 19: పల్నాడు జిల్లాలోని నిరుద్యోగులకు నవోదయం ద్వారా జీవనోపాధి కలిగించి వారి జీవితాల్లో వెలుగులు నింపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. పల్నాడు జిల్లాలో నవోదయం ద్వారా దరఖాస్తు చేసుకున్న ఆరుగురికి బ్యాంకుల ద్వారా రాయితీ వాహనాలను సోమవారం జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ నవోదయం ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలు పొందినవారు ఆయా బ్యాంకులకు సకాలంలో రుణాలు తిరిగి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో నవోదయం నోడల్ అధికారి కే సంజీవరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం శ్రీనివాసరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి: సీడీపీవో అనూరాధ

శావల్యాపురం, ఫిబ్రవరి 19: బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రజల కర్తవ్యంగా భావించి అధికారులకు తమవంతు సహకారం అందించాలని బాలల సంక్షేమ రక్షణ కమిటీ కన్వీనర్, సీడీపీవో ముదివర్తి అనూరాధ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శావల్యాపురం పీహెచ్‌సీలో బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలపై ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బాల్యవివాహాలు చేసుకొంటే 1098, 181 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.

వజ్రగిరి జెస్టిస్‌కు రెండు జాతీయ అవార్డులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19: పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో, గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిర్‌లో ఆదివారం జరిగిన పలు వేర్వేరు కార్యక్రమాల్లో జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. 2024 జనవరిలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి, ఆర్ట్ లెజెండ్ అవార్డుతో పాటు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జామవా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ప్రథమబహుమతి సాధించి బాపు అవార్డును పొందారు.



గాంధీనగర్‌లో డ్రోన్ చిత్రీకరణను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు, రైతులు

అగ్రహారం భూముల్లో డ్రోన్ ఫొటోల చిత్రీకరణ

నూజెండ్ల, ఫిబ్రవరి 19: మండలంలోని కొండ్రప్రోలు, తిమ్మాపురం, వీ అప్పాపురం గ్రామాల అగ్రహారం భూములను డ్రోన్ ద్వారా భూముల వివరాలు చిత్రీకరించినట్టు మండల సర్వేయర్ చండీరాణి తెలిపారు. తిమ్మాపురం రెవెన్యూ పరిధిలోని గాంధీనగర్, తిమ్మాపురం గ్రామాల్లోని భూములను డ్రోన్ ద్వారా భూముల వివరాలను ఫొటోల రూపంలో సేకరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ ఎం.జయరామిరెడ్డి మాట్లాడుతూ అగ్రహారం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చేందుకు సాంకేతిక పరిజ్ఞానం తోడ్పడుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడికి నిరసన



చిలకలూరిపేట జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై జరిగిన దాడికి పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జర్నలిస్టులు సోమవారం నిరసన తెలిపారు. ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత జర్నలిస్టులు జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి దాడికి బాధ్యులైన వారిని అరెస్టుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై తరచూ జరుగుతున్న దాడులను ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వీ భక్తవత్సలరావు, మస్తాన్‌వలి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై జరిగిన దాడితో రాష్ట్రంలో జర్నలిస్టులకు ఏమాత్రం స్వేచ్ఛ లేకుండా పోయిందని రుజువైందన్నారు. ముఖ్యమంత్రి జగన్ తక్షణం సంఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నలదాసు శేషగిరిరావు, షేక్ అబ్దుల్ సత్తార్, వివిధ పత్రికలు, చానల్స్‌కు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు. కాగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇనగంటి జగదీష్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అన్నపరెడ్డి లక్ష్మణ్, మదర్ థెరిస్సా సేవా సమితి కార్యదర్శి దార్ల రాజేష్, పట్టణ టీడీపీ బీసీ సెల్ నాయకులు మటన్ మజ్ను, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అందెల శౌరి, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ పెంటేల బాలాజీలు ఖండించారు.

నరసరావుపేటలో..

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడిని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ టీ అజయ్‌కు వినతిపత్రం అందజేశారు. ముందు అడిషనల్ ఎస్పీ ఆర్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షుడు నంద్యాల జగన్‌మోహన్‌రెడ్డి, సెక్రటరీ పుల్లంశెట్టి నాగరాజు, కార్యవర్గ సభ్యులు బుచ్చిబాబు, టీ శ్రీనివాసరావు, పాత్రికేయులు పాల్గొన్నారు.

దాడికి ఎంఐఎం ఖండన

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై దాడిని ఎంఐఎం నాయకుడు షేక్ మస్తాన్‌వలి సోమవారం ప్రకటనలో ఖండించారు. ప్రతిక ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయటం అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయటమేనన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొట్టడం దారుణం: శ్రీనివాసరెడ్డి

నరరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్‌పై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టడం దారుణం అని పల్నాడు టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. జగన్‌రెడ్డి చొక్కాలు మడతపెట్టండి అని సిద్ధం సభలో బాహాటంగా చెప్పటం వాళ్ళ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టడమేనన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు తమ కంటి ముందు జరుగుతున్న దారుణాలు కూడా ఆపే పరిస్థితి లేకపోవడం రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరును తెలియజేస్తుందన్నారు.

● రొంపిచర్ల: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై జరిగిన దాడిని రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోలీసులు ఇటువంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 25 దళిత కుటుంబాలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 19: మండలంలోని నీలగంగవరం ఎస్సీ కాలనీకి చెందిన 25 దళిత కుటుంబాలు టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ మాదినేని ఆంజనేయులు, మాజీ డీసీసీ అధ్యక్షుడు ముత్తినేని ఏడుకొండలు ఆధ్వర్యంలో వైసీపీని వీడి సోమవారం పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు పార్టీలో చేరిన ఎనుముల నర్సయ్య, పెద్దఫకీర్, చిన్న ఫకీర్, ఇమ్మానుయేలు, నగేష్, చిన్నరత్తయ్య, కోటయ్య, సుదర్శన్, కోటేశ్వరరావు, అబ్రహాం, ఎనుముల జాన్‌బాబు, మరియబాబు, ప్రభుదేవ, గణేష్, పాల్‌రాజ్, చీకటి దేవయ్య, శిఖా గౌతమ్‌రాజు, లూకయ్య, లాజర్, రెడ్డిబోయిన కోటేశ్వరరావులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు చేసిందేమీ లేదని, జగన్‌మోహన్‌రెడ్డి మాటలు విని మోసపోయామని తెలిపారు.

సిద్ధం సభలో జగన్ చెప్పే మాటలన్నీ అశుద్ధాలే..!

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సిద్ధం సభలో జగన్ చేప్పే మాటలన్నీ అశుద్ధాలేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎవరిది అభివృద్ధి పాలనో ఎవరిది విధ్వంస పాలనో ప్రజలు గమనిస్తున్నారని జగన్ సభలు పెట్టి చెప్పవలసిన అవసరం లేదన్నారు. బూటకపు ప్రసంగాలతో అబద్ధాల అంకెల గారడి చేయడం కాదని, దమ్ముంటే వైసీపీ చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎవరిపాలన స్వర్ణయుగమో, ఎవరి పాలన రాతియుగమో ప్రజలు నిర్ణయిస్తారని, వైసీపీ గూండాలు సభలు పెట్టి చెప్పనవరసం లేదన్నారు. ఓటమి భయంతో జగన్ 77మందిని మడతపెట్టారని, మిగిలిన వాళ్ళని 50రోజులలో జనం మడత పెడతారన్నారు. రూ.100 కోట్ల ప్రజాధనంతో సిద్ధం సభలు పెట్టి జగన్ నోటికొచ్చిన అబద్ధాలను వాగుతున్నారని మండిపడ్డారు. రాయలసీమలో సభ నిజంగా విజయవంతం అయితే జగన్ రౌడీమూక జర్నలిస్ట్‌లపై ఎందుకు దాడి చేశారని ప్రశ్నించారు. ఎన్నికల్లో యుద్ధం జరిగేది నిజమైన పెత్తందారు జగన్‌కి ఐదు కోట్ల ఆంధ్రులకు జరుగుతుందన్నారు.

పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జేఏసీ నిరసన

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో రావాల్సిన బకాయిలు పక్కన పెట్టినా 2018నుంచి ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ గ్రాంట్ కింద వీఅండ్ఈ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని పంచాయతీరాజ్ ఇంజనీర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగీతరావు అన్నారు. సోమవారం ఏపీపీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నరసరావుపేట పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర జేఏసీ 19 నుంచి 22 వరకు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలియజేసే కార్యక్రమం రాష్ట్రం మొత్తం పెట్టామని అన్నారు. 23 నుంచి 26 వరకు భోజన విరామ సమయంలో నిరసన తెలియజేస్తాం అన్నారు. 27న మహాధర్నా నిర్వహిస్తామని, 28 నుంచి సహాయ నిరాకరణ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎస్కే బాషా, రామాంజనేయరెడ్డి, డివిజన్ ట్రెజరర్ బీ నాగేశ్వరరావు, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన సబ్‌స్టేషన్ ప్రారంభం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని ఉప్పలపాడులో నూతనంగా ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో, కేశానుపల్లి పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన టిడ్కో ఇళ్ళ వద్ద నూతనంగా నిర్మించిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్లను నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.

ఆర్‌బీకేల్లో బ్యాంకింగ్ సేవలు

నూజెండ్ల, ఫిబ్రవరి 19: మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఏవో సుగుణాబేగం సోమవారం తెలిపారు. ఇప్పటికే నాలుగుచోట్ల ఉన్నాయని మిగిలిన 11 రైతుభరోసా కేంద్రాల్లో బీసీలను నియమించనున్నారు.

చిన్నారులను సంరక్షించరూ..

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: యాచన చేస్తున్న చిన్నారులను సంరక్షించాలంటూ స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడు సదాశివరెడ్డి, అతని స్నేహితుడు వందనం బాబు సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు. నరసరావుపేట పట్టణంలో రైల్వేస్టేషన్ వద్ద సదాశివరెడ్డి ఆహార పొట్లాలను యాచకులకు అందించేందుకు ఆదివారం వెళ్ళినప్పుడు ఇద్దరు చిన్నారులను గమనించారు. ఆ చిన్నారుల గురించి ఆరా తీయగా వారికి తండ్రి లేరని, తల్లి కూలి అని తెలిసి వారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించడానికి ఫోనుద్వారా సంప్రదించడానికి ప్రయత్నించగా వారు స్పందించలేదు. దీంతో సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థికసాయం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 19: పట్టణంలోని మదర్ థెరిస్సా కాలనీలో 38వ వార్డులో నివశిస్తున్న క్యాన్సర్ బాధితుడు షన్‌సైదాకు వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం తేళ్ళ హరిప్రసాదు, చారిటబుల్ ట్రస్ట్ వారు ఆర్థికసాయం చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ సుధీర్ రూ.10వేలు నగదును బాధితునికి అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. కార్యక్రమంలో కంకటి శివ, జంగా ఏడుకొండలు, పారా నాయక్, శ్రీకాంత్, నాగ భూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 19: పట్టణంలోని కల్యాణి సెంటర్‌లో కొనసాగుతున్న ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్ ద్వారా సోమవారం 640మంది నిరుపేదలకు భోజన సదుపాయం కల్పించారు. ఈ అన్న క్యాంటీన్ పట్టణ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కరీం, వసీం, తూబాడు సుభానీ, టైలర్ ఖాజావలి, షేక్ అన్సర్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుచ్చిబాబు తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా సేవలందించారు.

దుకాణంలో చోరీ

నాదెండ్ల, ఫిబ్రవరి 19: మండలంలోని గణపవరంలో ఒక దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రధాన రహదారిలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఎన్.హరికృష్ణ అనే వ్యక్తి నిత్యావసర దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దుకాణంపై ఉన్న సిమెంట్ రేకులను తొలగించి రూ.2వేలు నగదుతో పాటు రూ.2వేలు విలువ చేసే సిగరెట్లను చోరీచేశారు. కాగా ఇటీవల కాలంలో ఇలాంటి చోరీలు పెరిగాయని గ్రామంలోని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఆర్థికసాయం

నాదెండ్ల, ఫిబ్రవరి 19: మండలంలోని గణపవరంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన టీడీపీ మాజీ వార్డు సభ్యుడు శీలం వెంకటేశ్వర్లు సోమవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు మల్లెల ఆర్థికసాయం

యడ్లపాడు, ఫిబ్రవరి 19: యడ్లపాడు మండలం తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన దావల చెంచుబాబు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెంచుబాబు కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలియచేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయాన్ని తన అన్న కోటేశ్వరరావు ద్వారా కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డీలర్ మంద రాంబాబు, సామ్యూల్‌పాల్, రమేష్, కోటయ్య, బొంత రమణయ్య, మిరియాల సురేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి డిగ్రీ కాలేజీలో ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19: స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సీనియర్ మెన్ సెలెక్షన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సెక్రటరీ ఎం.సుబ్బరాజు హాజరయ్యారు. గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 3నుంచి 5వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే కబడ్డీ అంతర జిల్లా పోటీలలో పాల్గొంటారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 19: కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ఉప్పలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం తంగేడుమల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి, సకిల చంద్రశేఖర్‌లు మోటార్‌సైకిల్‌పై వస్తూ బస్సును ఓవర్‌టేక్ చేసే సమయంలో అదుపుతప్పి బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో రాజేశ్వరి(32) అక్కడికక్కడే మృతిచెందింది. సకిల చంద్రశేఖర్‌కు గాయాలు కావడంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతిరాలి భర్త మోటుపల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.